# కర్పూరం

## 1

ప్రేమ గుడ్డిది!

ప్రేమ పిచ్చిది!!

ప్రేమకు ఎల్లల్లేవు!!!

పొంకపు బిగి సడలి అర్థం దిగజారిన మాటలు. తెరమీద, అచ్చులోనూ, తామర తంపర పుట్టుకొస్తున్న కుక్క గొడుగు కథల్లోనూ మళ్ళీ మళ్ళీ వాడబడి వాటి వాడి కోల్పోయిన మాటలు.

పది నిముషాలు కాకుండా తెర మీద జరగబోయే కథ ఆకళింపుకు వచ్చేసింది.

రచయిత కావటం శాపమేనా! మొగ్గలు వేసి వేసి అలసిపోయిన సర్కసు పని వాడికి సర్కసు చూడడం ఆనందాన్నివ్వదు. తెరమీద మూసకట్టి రచయిత చెబుతున్నది, చెప్పబోయేది కంటికి మూడు రీళ్ళ ముందు కనబడేటట్టు రాయడం, తోటి రచయితకి ఇట్టే తెలిసిపోతుంది. రచయితయిపోయిన తరవాత చదువరి లక్షణాలు కోల్పోయి వికలాంగుడయి పోయినట్టు ఒక్క మెరుపులో తెలిసి రావడంతో మనసు ఘుచ్చుమంది.

## 2

కొండ నంతటినీ చూస్తాయి చిటికెడు కళ్ళు. మధుకర్రావు కళ్ళు మరీను.

"మీ కళ్ళు మంచివి కావు బాబూ!" రాధ ఒకసారి జడ వేసుకుంటూ చెడేల్ మంది.

రంకు వెధవ కథ అని అరుగుమీద ఆడంగులూ, గట్టు మీద చాకలి మనిషి మొదలుకుని ఆడపిల్లల కాలేజీ స్టాపు రూమ్‌లో చిన్నారులు సైతం బుగ్గలు రెండూ గట్టిగా నొక్కుకుంటున్నారని మధుకర్రావుకి తెలుసు.

ఎలా?

అతని కళ్ళు అలాంటివి.

ఇది నే రాసిన కథేకాని నా కథ కాదుమొర్రో అంటే నిన్న వాళ్ళు వినిపించుకుంటేనా? దానితో విసుగెత్తి నాకథ రాయడం శ్రేయోభంగమని తెలుసుకుని వెంటనే కథంతా గోపాలకృష్ణ కథగా మలిచి మరీ ఫెయిర్ కాపీ చేశాడు.

## 3

నటుడు దగ్గర కొస్తుంటే (అతని ముఖంలో హీరో లక్షణాలూ, విలన్ లక్షణాలూ రెండు బయట పడడానికి పోటీ పడుతున్నాయి) నటి భయం, అంతకంటె కాంతి తక్కువ ఆశ్చర్యం అభినయిస్తోంది బొమ్మ ప్రేమ మీద మనసును కేంద్రీకరించలేకపోవడం కృష్ణకి ఈ దరిమిలానే వచ్చింది.

వీళ్ళ పూర్వ ప్రేమ భర్తకి తెలిసిపోతే?

సిల్లీ ప్రిజంప్షన్. పూర్వ ప్రేమ అన్నమాటలోనే ఉంది. వాస్తవికత లోపించడం. పూర్వప్రేమ అంటే ముందుండి తరవాత పోయిందనేగా అర్థం. ఒకసారి ప్రేమించి మరిచిపోవడమే సాధ్యం కాకపోతే ద్వేషించడం ఎలా సాధ్యం?

జీవితాన్ని గురించి చేసిన జనరలైజేషన్స్ సామాన్యీకరణలు చేసిన వాడి మూర్ఖత్వానికి కాకపోతే సంకుచితత్వానికి నిదర్శనాలు. పేలవంగా, తిక్కగా, చేదుగా ఉంటాయి.

ఒక్కొక్క సన్నివేశం అరిగిపోయి అరిగిపోయిన బోళా గిన్నెల్లా, చిల్లి కుండల్లా ఉత్సుకత నింపుకోలేకపోతున్నాయి. కాని బయట పడడం ఎలా?

పడి ఏం చేయాలి?

తెరమీద హాస్యం అభినయించ చూస్తున్నాడొకాయన.

హృదయ విదారకంగా ఉంది.

నాటకీయమైన సంఘటనలు అచ్చులో నైనా, అచ్చమైన వైనా ముప్పైఆరేనని రాశాడు ఒకాయన.

(పేరు నన్నడగకండి. మనం ప్రామాణికుడనుకునే పాశ్చాత్యుడే) ముప్పై ఏడవది కనిపెట్టి ఎన్నుకో గలగడం మేధస్సుకి పరీక్ష. మెదడుకు అరగని మేత. వాస్తవికతకు గీటు రాయి కాగలిగిన విమోచన. కాని వ్యాపార రీత్యా లౌక్యంలేని సాహసం కావచ్చు.

ఆల్కహాల్ ఫ్రీ సినిమా తియ్యగలిగిన ఒడుపును కోల్పోతున్నారు మన వాళ్ళు. తెరమీద బుడ్లు సారాబుడ్లు కోడి గుడ్లు ప్రజాభిరుచులను పెంచాల్సిన బృహత్తర బాధ్యతకీ, నాలుగు రాళ్ళు చేసుకునే కండూతికీ పొత్తు కుదరదు. తాగుబోతు మారడం లాంటి అవాస్తవికతను తాగుడు కష్టాన్ని మరిపించ జేస్తున్న దన్న నమ్మక మంత అవాస్తవికతను పెంపు చేసేస్తున్నారు.

తెర వంక చూడకుండా మసక వెలుతురులో ముందు తలకాయలను పరీక్షిస్తున్నాడు గోపాలకృష్ణ. ముందు వరసల్లో ఉన్న పిల్ల లైదారుగురు సంకేతం ఏదో అందుకున్నట్టు ఒక్కసారి ఏడుపు లంకించుకున్నారు.

## 5

వలరః కేకరః...మెల్లకంటి వాడి కళ్ళకి మామూలు కంటి వాడికి కనపడినవే కనపడినా మెల్లకంటి వాడి చూపు జుగుప్సాకరంగా ఉంటుంది.

అసలు తనెందుకు సినిమాకి వచ్చాడు?

తాగితే వాస్తవాన్ని మరిచిపోవచ్చన్న నమ్మేటంత మేరకు వ్యక్తిత్వం పెరగక పోవడం చేత, లేక, పడిపోకపోవడం చేతా?

## 6

"రాధ వచ్చిందట?"

నామకరణ ముహూర్తం ఏమిటో కాని కొన్ని కొన్ని పేర్లు సార్థక మౌతాయి. గాలిలో తథాస్తు

దేవతలుండటం నిజమని అనుకోవలసి వచ్చే క్షణాలుంటాయి.

రాధకి రుక్మిణని పేరు పెడితే గోపాలకృష్ణ సినిమాలో దాక్కోవలసిన అవసరం లేకపోయేదేమో.

స్టుపిడ్ ఫిల్మ్ అతను మూడోసారి అనడం, ముందున్న మల్లె సిగ అతని వంక కళ్ళజోడు లోంచి చూడడం అతను కర్చీఫ్‌లో ముఖం దాచుకోవడం, ఇవన్నీ ఒక వంక జరుగుతున్నాయి.

రాధ వచ్చిందంటే గోపాలకృష్ణకి గుండె దడ కాదు కాని ఏదో జరుగుతుంది. వస్తుంది. మనసు కసిగా పళ్ళు కొరుకుతుంది. వేదాంతిలా నవ్వుకుంటుంది. ఆవలించి ఆశగా మేలుకుంటుంది. బరువుగా మూలుగుతుంది.

ఫర్ సమ్ సెటిమెంటల్ రీజన్ రాధ గోపాలకృష్ణని చూడకుండా వెళ్ళిపోదు తన వంక కృష్ణ చూడకపోయినా సరే. ప్యూర్ సాటిస్‌ఫాక్షన్.

అంతా తెలిసి ఆట పట్టించడం ఆడవాళ్ళకి హాబీ.

రాధ వచ్చిందని కృష్ణతో ప్రత్యేకంగా పిలిచి చెప్పడంలో సత్యప్రియ ఉద్దేశ్యం ఏమిటి?

నోటితో గోపాలకృష్ణ ఏ నాడూ బయట పడడని తెలిసి అతని ముఖం చూడడానిక్కాదూ?

అన్నీ తెలిసినా నిండు కుండలా తొణకకుండా ఉండడం సత్యప్రియ మనో నిగ్రహానికి మరో నిదర్శనం అనుకున్న క్షణమూ ఉంది గోపాలకృష్ణకి.

రాధని గోపాలకృష్ణ ఎప్పుడు కలుసుకున్నాడో సరిగా అతనికే గుర్తు లేదు. ఆమెతో గడిపిన కొన్ని క్షణాలు మాత్రం మరిచి పోవడం అసాధ్యం.

## 7

వాన తుంపరగా పడుతోంది. డిప్రెషన్ వల్ల వచ్చిన ముసురు ఖమ్మం నుంచి పడుతూనే ఉంది. నాంపల్లి పోవడం వాళ్ళిద్దరికీ అలవాటు.

ఈ రోజుకికూడా కాచిగూడా స్టేషన్ దగ్గరున్న తుల్జాభవన్ దగ్గరకు బస్సు మీద పోతుంటే గోపాలకృష్ణకి టూరిస్టు హోటలే మనసులో బాధలా మెదులుతుంది.

తీరా హోటల్ కొచ్చేసరికి రూమ్ లేదనేశాడు రిసెప్షనిస్ట్.

స్టేషన్ నుంచి రింగ్ చెయ్యాలిసింది. ఇప్పుడనుకుని ఏం లాభం? రాధ గోపాలకృష్ణ వంక జాలిగా చూసింది.

అలవాటయిన హోటల్ దొరక్క పోతే మనసులో బెంగ. కాని గోపాలకృష్ణ ఆ మూడు రోజులకి ఏ హోటల్ అయితేనేం లెద్దూ. అన్నాడు నవ్వుతూ.

మరో హోటల్లో దిగిన గోపాలకృష్ణ మళ్ళీ టూరిస్ట్ హోటల్లో రూమ్ సాధించే వరకూ తృప్తి పడలేదు.

"అరెరె. తొందరలో ఆ బెడ్డు కింద పడేసినవి తియ్యడం మరిచి పోయాను. ఛీ ఆ హోటల్ వాడేమనుకుంటాడు? బజారు మనిషిలా సిగ్గు విడిచే ననుకుంటాడు."

కొత్త హోటల్లో మంచం మీద కూచుని వాపోయింది రాధ.

"నువ్వు పడేసింది ఏమిటి?" గోపాలకృష్ణ సాగదీశాడు.

"మీ కన్నీ బడాయిలే. నా చేత చెప్పించాలని...ఛీ ఎప్పుడూ లేదు. ఈమారు ఇలా అయింది."

గోపాలకృష్ణకి బోధ పడింది.

మరకలు దుప్పట్ల మీద నుంచి తియ్యలేక పోయినా రబ్బర్లు మాత్రం బాత్‌రూమ్‌లో భద్రంగా ఫ్లష్ చేసింది.

మనం డబ్బు ఇచ్చి మన హక్కుల్ని మనం కొనుక్కుంటే పొరపాటున జరిగిన దానికి హోటల్ వాళ్ళు ఏదో అనుకుంటారని రాధ బాధ పడడం చూసి ఆమెను వెక్కిరించాలని ఉండేది కృష్ణకి.

## 8

రూము తాళం కోసం రాధ బాగులో వెతుకుతోంది.

కారిడార్ ఖాళీగా ఉంది.

"ద్వారానికి తారామణిహారం,
హారతి వెన్నెల కర్పూరం."

కృష్ణ చిన్నగా పాడుతున్నాడు.

బాగుంది. తలుపు వేస్తా. లోపల కొచ్చి ప్రశాంతంగా పాడండి.

"అస లీ పాట అర్థం తెలుసా?"

"ఎక్కడ దీపాట?"

"వండర్‌ఫుల్ మనం ఇప్పుడు చూసిన సినిమాలోది." రాధ సినిమా చూడడం లేదని కృష్ణకి తెలియక కాదు. రక్తం గూడు కట్టిన భుజం గుర్తు చేసింది.

"లోపల కెళ్ళే వరకూ ఆగదలచుకో లేదా?"

"ద్వారం దగ్గరే హారతి. ద్వారానికి పచ్చతోరణం తారామణిహారం. హారతి వెన్నెల కర్పూరం. ఇక్కడున్నది బార్ లైట్ కర్పూరమే. మనం కొత్త దంపతులంకాదుగా. ఇంతటితోనే సరిపెట్టుకోవాలి."

"ఏం కవిత్వం?" తలుపు తీసే వరకూ ఆగలేదు రాధ.

"ఏమిటీ వరండా మీద? ఎవరైనా చూస్తే." గోపాలకృష్ణే సిగ్గు పడిపోయాడు.

## 9

రాధ తన గదిలోకి వస్తే సహోద్యోగులు ఎంతో విచక్షణతో ప్రవర్తించే వారు.

మాటల్లో నమ్మకం లేని గోపాలకృష్ణ వెంటనే చేతలకి ఉపక్రమించే వాడు. అర్జంటుగా చేయవలసిన దానికి ఆలింగన చుంబనాదులెందుకని సామెత.

అబ్బ. బొట్టు చెరిపేస్తున్నారు.

పోన్లెద్దూ మళ్ళీ ఎంత సేపట్లో పెట్టుకోవాలి?

కళ్ళు ఎంత పెద్దవిగా విప్పుకుని ఆ వ్యవహారంలోకి దిగినా చివరికి బాధ కలిగించడం మానదు. ఏ వ్యవహారమైనా సరే ఈ రకానికి సంబంధించినది.

గోపాలకృష్ణ రాధ బొట్టు ఎందుకి చెరిపాడు? తోటి ఉద్యోగులకు తన చొక్కా మీద బొట్టు కనపడితే నవ్వుతారని కదూ రాధ బొట్టు తనకు మచ్చ కాకూడదని కదూ ఎంత స్వార్థం?

పాపం రాధ. అనుకునే వాడు.

పాపం. గోపాలకృష్ణ వాట్ ఎ కామెడీ.

10

"గోత్రం?"

పూజారి అడిగితే ఏబ్సెంట్ మైండెడ్‌గా సమాధానం చెప్పిన గోపాలకృష్ణకి ధర్మపత్నీ సమేతస్య... అని అతగాడు వర్ణించేస్తూ ఉంటే రాధ కంటిలోకి భయంగా ధైర్యంగా చూశాడు.

చిరునవ్వుతో హుందాగా కుంకుమ నందుకుని ముఖాన్న బొట్టుంచుకుంది రాధ.

అది ధైర్యమా.

తను పాపానికి అతీతురాలిననే ఆత్మ విశ్వాసమా?

11

రాధ రాసిన ఉత్తరాలు మూడు కట్టలు గది ఖాళీ చేస్తూ ఏం చెయ్యాలని ఎంతగా ఆలోచించాడు? రాధ ఏ నాటికీ తనదే ఉత్తరాలెందుకు? ఒక్కొక్కటే ఇతరులు చదవడానికి వీల్లేకుండా చింపుతుంటే తనలో ఉత్పన్నమైన ప్రేమ పక్షిని రెక్కలు ముక్కలు చేస్తున్నట్టు ఎందు కనిపించలేదు?

ఆ రోజు అవన్నీ అతని చేతిలో ఉంటే రాధ అంత తల బిరుసుగా ఉండగలిగేదా?

కసిగా పళ్ళు కొరుక్కునే వాడు.

ఒక విధమైన నిస్తేజం కదూ, రాధ మీద కసి గురించి ఆలోచించడం మానేసింది? లేక జ్ఞానోదయమైన కారణంగానా? ప్రేమకి ప్రతీకార వాంఛ పొత్తు ఎలా కుదురుతుంది? ప్రేమకి మూలకందం అవగాహన కదూ.

కసి తీర్చుకోవడానికి పనికి వచ్చే ఆధారాలు ఆ ఉత్తరాలు కాలి మసి అయిపోయాయి. ఇన్నేళ్ళ తరవాత ఆ లాంగ్ డిస్టెన్స్ కాల్స్ ట్రేస్ చేసినా ఏం ఋజువు చెయ్యగలడు?

12

పూర్ డియర్! తను ఆనందంగా హోదాతో వర్ధిల్లుతున్నట్టు గోపాలకృష్ణని నమ్మించాలనుకుంటుంది రాధ. ఆనందం టెలివిజన్ సెట్టులోనూ, ఎయిర్ ట్రావెల్‌లోనూ ఉందని పాత ప్రియుడిని నమ్మించడం సాధ్యమా?

పాతప్రియుడు ఒక విధంగా మొదటి భర్త రాధ ఆంతర్యంలో తెలియని లోతులేదు గోపాలకృష్ణకి.

"రగ్గు బావుంది కేమెల్ హెయిరా?"

బూజుపట్టిన గదిలో ఉన్నా, ఎయిర్ కండిషన్డ్ గదుల గురించి మాటాడేది రాధ.

13

ప్రేమకు కళ్ళున్నయ్!

ప్రేమకు మతిస్థైర్యం ఉంది!!

ప్రేమకు ఎల్లలూ ఉన్నాయ్!!!

ఇవన్నీ రాధ నిరూపించింది.

ఆఫ్టరాల్ గోపాలకృష్ణ జీతం మహావస్తే వెయ్యి. చేతికొచ్చేది ఏడువందలే!

అతనికిక మూడు వేలు జీతం.

ఆరు నెల్లకా? గోపాలకృష్ణ అడిగాడు నవ్వుతూ. నేలకూలుతున్న మేడని చేతితో ఆపే ప్రయత్నం చేస్తున్నట్టు.

## 14

హారతి కర్పూరం. వెన్నెల కర్పూరం. ఒకటి సహజం. రెండవది కవి కల్పన. ఒకటి నైవేద్యం మరొటి ఆస్వాద్యం.

"ఒహో!" అందులో ఎగతాళి ఉందన్నది గోపాలకృష్ణ అనుమానమేమో!

"హలో!" పని ఉన్నట్టు గోపాలకృష్ణ పెరటిలోకి వెళ్ళిపోయాడు.

"రండి, రండి!" సోఫాలోంచి లేచి నుంచుంది సత్యప్రియ.

"ఆయన రెండు గంటలకి సైకిలు దించుతుండడం చూశాను. సినిమాకు వెళ్ళారా?" రాధ సత్యప్రియ నడుగుతోంది.

"ఏం సినిమా కెళ్ళారు" సత్యప్రియ అడిగింది గోపాలకృష్ణని ఆ రాత్రి.

"మంచి మనసట సెంటిమెంటల్ థింగ్..."

"మీకు ఏది నచ్చింది లెద్దురూ?" రాధలా మాట్లాడింది సత్యప్రియ

## 15

పాతప్రియుడి దగ్గరకు పతివ్రత ఎందుకొస్తుంది?

చిచ్చు రగల్చడానికి కాదు.

చల్చార్చడానికి కాదు.

తన భర్తకంటె తన ప్రియుడు కట్టుకున్న భార్యని సుఖపెట్టేస్తున్నాడేమోనని చూడడానికా?

తనకంటె ఆవిడ సుఖపడిపోతోందేమో నన్న 'దుగ్ధ' చూసి పోగొట్టుకోవాలన్న ఆశతోనా?

తన ఔన్నత్యం గొప్ప ప్రియుడికి కాదు, అతని భార్యకి చూపడానికా?

ఆంధ్రప్రభ 25.7.1979